క్లుప్తంగా

నేడు ప్రజావేదిక

గోపవరం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 9–30 గంటల నుంచి 1–30 గంటల వరకు ప్రజావేదిక (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ తప్పక హాజరు కావాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. అలాగే 9–30 గంటల నుంచి 10–30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఉంటుందని, నేరుగా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమస్యలను తెలియజేయవచ్చన్నారు. 08562–244437 నెంబర్‌కు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఫోన్ చేయవచ్చని తెలిపారు.

ఎమ్మెల్సీ పరామర్శ



పుత్తా శ్రీరాములును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : అనారోగ్యానికి గురై కోలుకుంటున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పుత్తా శ్రీరాములును ఆదివారం స్థానిక భావనారాయణనగర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుని త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మాజీ కుడా చైర్మన్ సింగసానిగురుమోహన్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, ఏరియా కన్వీనర్లు చెన్నకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పట్టణ నాయకులు మల్లేశ్వర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, వివేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైకాలజిస్టును నియమించాలి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్

రాజుపాళెం : ప్రతి గ్రామ పంచాయతీలోని ప్రతి పాఠశాలకు ఒక సైకాలజిస్టును నియమించాలని ఆర్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం పర్లపాడులో మాట్లాడుతూ హత్యలు, ఆత్మహత్యలు, భార్యభర్తలు విడిపోవడం వలన వారికి పుట్టిన పిల్లల జీవితాలు అయోమయంలో పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి చిన్న విషయానికి మిస్ బిహేవియర్ వలన ఒకరినొకరు అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు పడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. రకరకాల సమస్యలతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొబైల్ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటి విద్యార్థులు మానసిక ఆనందం కోల్పోతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ఏది మంచి ఏది చెడో చెప్పకపోవడంతో ఆకర్షణకు గురవుతున్నారని పేర్కొన్నారు.

ధ్యానంతో ఒత్తిడిని అధిగమించవచ్చు



యోగా శిక్షణ ఇస్తున్న నారాయణరెడ్డి

పోరుమామిళ్ల: ప్రాణాయామం, ధ్యానం నిత్యం సాధన చేస్తే ఒత్తిడిని అధిగమించవచ్చని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.యస్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కస్తూర్బాగాంధీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు యూత్ ఎంపవర్‌మెంట్ సెమినార్ కింద మూడు రోజుల పాటు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలిని పీల్చడం వలన రోగాలు దరి చేరవన్నారు. సుదర్శనక్రియ దివ్య ఔషధం లాంటిదని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో యోగా టీచర్లు సాయికిరణ్, బిందు, పురుషోత్తమరెడ్డి, మనోహర్‌రెడ్డి, పాఠశాల పీఈటీ కమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఇన్‌చార్జి ఆర్‌ఐ అశోక్

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామానికి చెందిన వీఆర్‌ఏ కొంగోలి విలియం అనారోగ్యంతో మృతి చెందాడు. మండల ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు దహన సంస్కారాలకు రూ.15 వేలు మండల ఇన్‌చార్జి ఆర్‌ఐ అశోక్ ఆదివారం విలియం కుటుంబ సభ్యులకు అందజేశారు. విలియం మృతదేహానికి అశోక్‌తో పాటు వీఆర్‌ఓలు మహమ్మద్ రఫి, వరదశేఖర్, వీఆర్‌ఏలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఎదురుచూపులు..!

- శ్రీశైలం డ్యాంకు చేరుతున్న వరద నీరు
- రైతుల్లో చిగురించిన ఆశలు
- సాగుకు సిద్ధమవుతున్న అన్నదాత

వానల్లేవని బెంగపెట్టుకున్న అన్నదాతకు శ్రీశైలం జలాశయానికి వస్తున్న వరద సంతోషానిచ్చింది. నైతురు మొదట్లో కురిసిన వర్షం మళ్లీ రాకపోవడంతో కర్షకులు ఆందోళన చెందారు. వరుణుడు కరుణించపోవడంతో సాగు చేసినా నష్ట పోతామని ఆవేదన చెందారు. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం పెరగడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు.



నీరులేక బోసిపోయిన కొండపేట కెనాల్

ఖాజీపేట : సరైనా వర్షం లేక పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కేసీ కాలువకు నీరు వస్తుందా రాదా అన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. అయితే శ్రీశైలం జలశయానికి వస్తున్న వరద నీటితో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. కాలువకు నీరు వస్తుందన్న నమ్మకం రైతుల్లో ఏర్పడంది. దీంతో రైతులు పంట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

శ్రీశైలం డ్యాంకు భారీగా వరద నీరు

శ్రీశైలం డ్యాంకు భారీగా వరద నీరు చేరుతోంది. ఆదివారం అందిన సమాచారం మేరకు ఇన్‌ఫ్లో 4,41,222 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 61,111గా ఉంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు, ప్రస్తుత నీటి మట్టం 873.40 అడుగులు చేరుకుంది. 841 అడుగుల నీటి మట్టం చేరితే పోతిరెడ్డి పాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా దిగువకు నీరు వదులుతారు. ఇప్పటికే 873 అడుగులకు నీరు వచ్చింది. దీంతో దిగువకు నీరు వదిలే అవకాశం ఉంది. తుంగభద్ర డ్యాం నుంచి భారీగా వరద వస్తోంది. సుంకేశుల బ్యారేజీకి నీరు చేరుతోంది. రెండు వారాల్లో నీరు కడప జిల్లాకు వచ్చే అవకాశం ఉందని కేసీ అధికారులు అంటున్నారు.

పంటలకు సిద్ధం అవుతున్న రైతులు

శ్రీశైలం జలాశయానికి వరద నీరు వస్తుండటంతో కేసీకాలువకు నీరు వస్తుందన్న నమ్మకంతో రైతులు పంట సాగుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ఖాజీపేట మండలంలో ఇప్పటికే చెరువులకు నీరు పడుతున్నారు. రావులపల్లె, ఆంజనేయకొట్టాలు, దుంపలగట్టు, చెరువులకు నీరు పట్టారు. దీంతో భూగర్భ జలాలు బాగా పెరుగుతున్నాయి. కేసీకాలువ ఆయకట్టు రైతులు వరి సాగుకు సిద్ధం అవుతున్నారు.

కేసీకెనాల్ క్రింద సాగులో ఉన్న ఆయకట్టు వివరాలు

క్రమ సంఖ్య	మండలం	ఆయకట్టు (ఎకరాల్లో)
1	ఖాజీపేట	20,818
2	దువ్వూరు	10,304
3	చాపాడు	20,944
4	మైదుకూరు	3,557
5	రాజుపాళెం	6,398
6	ప్రొద్దుటూరు	5,414
7	కడప	4,369
8	చెన్నూరు	8,254
9	వల్లూరు	413
10	సీకేదిన్నె	117

మొత్తం ఆయకట్టు : 81,232

2019 నుంచి కేసీకాలువ ఆయకట్టుకు నీరు అందించిన రోజులు

సంవత్సరం	నుంచి	వరకు
2019	10-08-2019	30-03-2020
2020	01-08-2020	30-04-2021
2021	01-08-2021	11-04-2022
2022	11-08-2022	30-04-2023
2023	11-10-2023	09-01-2024

ఎదురు చూస్తున్నాం



కేసీ కాలువకు నీరు వస్తుందని ఆశతో ఉన్నాం. అధికారులు స్పందించి నీరు సకాలంలో అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది. పంట సాగుకు వీలు ఉంటుంది. అధికారుల నుంచి ప్రకటన వస్తే ధైర్యంగా ఉంటుంది.

– రమణ, రైతు, చెర్లోపల్లె

ఆలస్యం అయితే నష్టం



నీరు సకాలంలో అందింతే రైతులు పంటలు సాగు చేసుకోవడంతో పాటు చీడపీడల నుంచి పంటలు తట్టుకునే అవకాశం ఉంది. ఆలస్యం అయితే పంటలు దెబ్బతిని రైతు నష్టపోయే అవకాశం ఉంది. అధికారులు నీరు విడుదలకు చొరవ తీసుకోవాలి.

– రవి శంకర్‌రెడ్డి, రైతు, కొమ్మలూరు

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



వర్మకల చికిత్స చేస్తున్న డాక్టర్ సాధిక్‌బాషా

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కర్ణాటకకు చెందిన వర్మకళ నిపుణుడు డాక్టర్ సాధిక్ బాషా పేర్కొన్నారు. స్థానిక వసంతపేటలోని శ్రీ చౌడేశ్వరి తొగటవీరక్షత్రియ కల్యాణమండపంలో కల్యాణమండపం, వరల్డ్‌హెల్త్ డెవలప్‌మెంట్ అండ్ హ్యూమన్ రైట్స్‌ఫోరం కర్నాటక ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన ఆకుకూరలు, మాంసం, గుడ్లు, పాలు వంటి మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. శరీరానికి వ్యాయామం చాలా అవసరమని, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్మకళ, ఆక్యుప్రెషర్, ఆక్యుపంక్చర్ వంటి చికిత్సా పద్ధతులతో 300పైగా రోగులకు వైద్యసేవలు అందించారు. బెంగళూరు, హైదరాబాదుకు చెందిన డాక్టర్లు నసీరుద్దీన్, అష్మ, ముసద్దీక్‌పాషా, సుబ్రహ్మణ్యం ఆచారి, సుభాన్, కరిముల్ తదితరులు వైద్యసేవలు అందించారు. మోకాళ్లనొప్పి, నడుంనొప్పి, పక్షవాతం, సయాటిక వ్యాధులకు వైద్యసేవలు చేశారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కల్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘురామయ్య, మనప్రజా సేవాసమితి అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, ఆదరణ స్వచ్ఛంధ సేవాసంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, స్నేహసేవా సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ మాల్లాది వెంకట రామనాథశర్మ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బ్రహ్మశ్రీ మాల్లాది వెంకట రామనాథశర్మ అన్నారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం బ్రహ్మశ్రీ మాల్లాది వెంకట రామనాథశర్మ శివపురాణం, రామాయణం, భాగవత పురాణాల్లోని శివకల్యాణం, సీతాకల్యాణం, రుక్మిణీ కల్యాణం గురించి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులు మనకు ఆదర్శమన్నారు. సీతారాములు కుటుంబ ధర్మానికి ఆదర్శంగా నిలుస్తారని, ధర్మాచరణలో భార్యాభర్తలు కలిసి అడుగు వేయాలని సూచించారు. శ్రీకృష్ణుడు సాక్ష్యాత్తు జగద్గురు అయినప్పటికి గృహస్తధర్మానికి ప్రాధాన్యత ఇచ్చి రుక్మిణి దేవిని వివాహం చేసుకున్నారని తెలిపారు. భార్యాభర్తల దాంపత్యం గురించి, వివాహ వ్యవస్థ ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డల రవీంద్రబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ఆగిన ఆర్‌ఓ ప్లాంట్

బి.కోడూరు : ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఐదు నెలల క్రితం మంజూరైన ఆర్‌ఓ ప్లాంట్ నిర్మాణానికి నోచుకోలేదు. అందుకు సంబంధించి వర్క్ ఆర్డర్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇవ్వకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మండలంలోని సిరిగిరిపల్లె దళితకాలనీకి మార్చిలో ఎంపీటీసీ చొరవతో ఆర్‌ఓ ప్లాంట్ మంజూరైంది. స్థానిక సర్పంచ్ అనుమతితో పాటు నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులు, స్థలాన్ని కేటాయించి బద్వేలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఐత్రంపేట ఎంపీటీసీ విజయకుమారి విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మంజూరైన ఆర్‌ఓ ప్లాంట్ నిర్మాణ పనులకు అనుమతులు ఇప్పించి నిర్మాణం చేపట్టవలసిందిగా ఎంపీటీసీ, గ్రామస్తులు కోరుతున్నారు.

బలహీన పడుతున్న మోదీ పొలిటికల్ గ్రాఫ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

బద్వేలు అర్బన్: దేశంలో ప్రధాని మోదీ పొలిటికల్ గ్రాఫ్ క్రమంగా బలహీన పడుతోందని, ఇందుకు అయోధ్యలో బీజేపీ ఓడిపోవడం, వారణాసిలో బీజేపీ మెజార్టీ తగ్గడమే రుజువని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల ప్రచారంలో 400 సీట్లతో గెలవబోతున్నామని ఆర్భాటం చేసినప్పటికీ చివరకు 240 సీట్లకే పరిమితమైందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయాంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ స్కాం వలన నీట్, జేఈఈ, మెయిన్స్ రాసే విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కడప ఉక్కు పరిశ్రమ కోసం యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, బి.మనోహర్, సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు, అన్వేష్, జిల్లాలోని వివిధ ప్రాంతాల సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పుష్పగిరిలో ఏఎఫ్‌యూ వీసీ

ఏఎఫ్‌యూ : పుష్పగిరి పుణ్యక్షేత్రంలోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని కడప వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు పుష్పగిరి స్థలపురాణం, విశిష్టతను వివరించారు. అనంతరం పూజారులు వేదాశీర్వాదం ఇచ్చారు. వైస్ చాన్సలర్ ఆలయంలోని అద్భుతమైన శిల్పకళా సంపదను పరిశీలించారు.

హెల్మెట్ ధరించండి

కడప ఎడ్యుకేషన్ : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్‌ను వాడాలని వన్‌టౌన్ ఏఎస్‌ఐ ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ఆదివారం కడప నగర ట్రంకు రోడ్డులో ద్విచక్ర వాహనదారులకు రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ షేక్ రాయల్ కరీముల్లా ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించండి అనే కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వన్‌టౌన్ ఏఎస్‌ఐ ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి తప్పుకోవచ్చు అని అన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?



కలసపాడులోని గిద్దలూరు రోడ్డు గుంతలమయమైన దృశ్యం

ఈ ఫొటో చూశారా.. మండలంలో రోడ్ల దుస్థితికి అద్దం పడుతోంది. మండల కేంద్రమైన కలసపాడులోని గిద్దలూరురోడ్డులో ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయమైంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇలాంటి దుస్థితి మండలంలోని ఎన్నో గ్రామాల్లో కనిపిస్తుంది. గ్రామాలను కలుపుతూ అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మరిన్ని కష్టాలు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు గుంతలను పూడ్చాలని స్థానికులు వేడుకుంటున్నారు.

– కలసపాడు

విద్యారంగ సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు

ప్రొద్దుటూరు : విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు తెలిపారు. స్థానిక పెన్నానగర్‌లోని ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఆదివారం పట్టణ సమితి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు పి.సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలు, ఇంటర్ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు ఉన్నాయని, సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్షుడిగా నరేంద్ర, కార్యదర్శిగా పీటర్, ఉపాధ్యక్షుడిగా అఖిల్, సుమంత్, ధనుష్, సహాయ కార్యదర్శులుగా షణ్ముఖ, ముస్తఫా, సాగర్, హర్షవర్ధన్, కోశాధికారిగా తౌసిఫ్‌ను ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న జేవీవీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు

పోరుమామిళ్ల: పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతని, పర్యావరణ పరిరక్షణకు అందరం కృషి చేద్దామని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పోలంకి శ్రీరాములు పిలుపిచ్చారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురష్కరించుకొని లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీరాములు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని కోరారు. వాహనాల నుంచి విడుదలయ్యే కార్బన్‌డైయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వలన భూ ఉపరితలం వేడెక్కుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చెట్ల నుంచి లభించే పండ్లు, కాయలు, ఆకుకూరలు, కూరగాయలు మనకు ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. జేవీవీ నాయకులు దాదాపీర్, గఫార్, గురయ్య, కాశింవలి, ఇన్నయ్య, పీర్‌బాషా పాల్గొన్నారు.

మానవతసేవలు అభినందనీయం



మానవత సభ్యులను సన్మానిస్తున్న చైర్మన్

వేంపల్లె : మానవత ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రభుత్వ వెటర్నీ వైద్యులు సాజిద్‌బాషా తెలిపారు. ఆదివారం చైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన మాసాంతర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. పేదలు, అనాథలకు మానవత చేస్తున్న సేవలు చాలా గొప్పవన్నారు. మానవత చైర్మన్ చక్రపాణి, సహాయ చైర్మన్ కృష్ణతేజ, కన్వీనర్ రంగారెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

అ 'పూర్వ' సమ్మేళనం

కొండాపురం : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91 పదవ తరగతి చదివిన విద్యార్థులు స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు రామలింగారెడ్డి, గణిత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయురాలు జయలక్ష్మిలు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులను జ్ఞాపికలతో పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ తల్లి బోనాలు



పూజలందుకుంటున్న గంగమ్మ తల్లి

చాపాడు: మండలంలోని చియ్యపాడు గ్రామంలో గంగమ్మ తల్లికి ఆదివారం వైభవంగా బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల మండలాలకు చెందిన పాతపాలెం, కొత్తపాలెం, పోట్లదుర్తి, కానపల్లె, మనేరాంపల్లె, గాంధీనగరం తదితర గ్రామాల్లోని నల్లబోయిన వంశపు కుటుంబ సభ్యులందరూ చియ్యపాడులోని గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి ఏటా ఇదే క్రమంలో గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించాలని అందరూ నిర్ణయం తీసుకున్నారు.



గంగమ్మ తల్లి సన్నిధిలో భక్తులు

కాలేయ వ్యాధిని నిర్మూలిద్దాం



ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు



చాపాడు: చాపాడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : వైరస్‌ల వలన వచ్చే కాలేయ వ్యాధిని నిర్మూలిద్దామని డాక్టర్ భరత్ నారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా శ్రీరాములపేటలో ఆదివారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం కాలేయ వ్యాధి ప్రపంచంలో అధికంగా ప్రబలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కాలేయ వ్యాధులను 2030 నాటికి నిర్మూలించడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తోందని తెలిపారు. శుభ్రం లేని సిరంజీలు, నీడిల్స్, బ్లేడ్‌లను ఉపయోగించడం ద్వారా కాలేయ వ్యాధి వస్తుందని వెల్లడించారు. విచ్చల విడి శృంగారం ద్వారా కూడా ఈ వ్యాధి వ్యాపిస్తుందని చెప్పారు. వ్యాధి నివారణ కోసం పరీక్షల ద్వారా వైరల్ హెపటైటిస్‌ను గుర్తించి తద్వారా తగిన చికిత్స చేయించుకోవాలని సూచించారు. అలాగే హెపటైటిస్ బి టీకాలను వేయించుకోవాలని సూచించారు. గర్భిణులందరూ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీబీరోడ్డు యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో

ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా టీబీ రోడ్డు ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. వైద్యాధికారి దినేష్ కాలేయ వ్యాధి రావడానికి గల కారణాలు, నివారణ మార్గాలను వివరించారు. సీఓ సుబ్బారెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యవతి, ఫార్మాసిస్టు దినేష్, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మించిన సంపద లేదు

ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా తెలిపారు. వరల్డ్ హెపటైటిస్ డే సందర్భంగా సోములవారిపల్లె పంచాయతీలోని పెన్నానగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా ఎక్కువ మంది కాలేయ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. ఈ వ్యాధి నివారణకు మంచి మందులు ఉన్నాయని డాక్టర్ తెలిపారు. సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, అప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, టీబీసూపర్‌వైజర్ ఉసేన్‌బాషా, హెల్త్ అసిస్టెంట్‌లు సుబ్బయ్య, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, రామకృష్ణ, డీఈఓ ప్రసన్న, హెచ్‌ఐవీ కౌన్సిలర్ ప్రమీల పాల్గొన్నారు.

చాపాడులో ర్యాలీ

చాపాడు: మండల కేంద్రమైన చాపాడులో ఆదివారం ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య మాట్లాడుతూ.. కాలేయ వ్యాధి గురించి ప్రజలకు వివరించేందుకు ప్రతి ఏటా కాలేయ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. హైపటైటీస్ బి వాక్సిన్ చిన్న పిల్లల్లో పుట్టిన రోజు నుంచి 24 గంటలలోనే వేయించుకోవాలని సూచించారు. రోటీన్ వాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ బాబురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్, ఏఎన్‌ఎం స్రవంతి, ఆశా పెర్సి తదితరులు పాల్గొన్నారు.